క్లుప్తంగా

అవినీతిపై సమాచారం ఇవ్వండి: ఏసీబీ సీఐ

నూజివీడు: విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలని, అవినీతి ఎక్కడున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఏసీబీ సీఐ కె.శ్రీనివాస్ కోరారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా స్థానిక ట్రిపుల్‌ఐటీలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అవినీతి వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అవినీతి నేడు ప్రపంచ సమస్యగా మారిందన్నారు. అవినీతి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీన్ వెల్ఫేర్ బాలికలు దుర్గాభవాని, పీడీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారించాలి



తిరువూరు: తిరువూరు పట్టణంలో కుక్కల బెడద తీవ్రతరమైంది. వీధి కుక్కల దాడిలో పలువురు గాయాల పాలవుతున్నారు. గతంలో నగర పంచాయతీ అధికారులు వీధి కుక్కలను పట్టి ఊరికి దూరంగా వదిలిపెట్టేవారు. జంతు కారుణ్య చట్టాల ననుసరించి వీధి కుక్కలను తాము పట్టుకునే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. పాత తిరువూరు, మధిర రోడ్డు, శాంతినగర్, రాజుపేటలలో కుక్కల బెడద అధికంగా ఉన్నందున అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రిటైర్డు ఉద్యోగుల సంఘానికి వితరణ



తిరువూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని తిరువూరు తాలూకా రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయానికి ఇరువురు దాతలు శనివారం ఎయిర్ కండిషన్, ల్యాప్‌టాప్‌ను అందజేశారు. రిటైర్డు ఉపాధ్యాయులు షేక్ జానీ, ఇంద్రగంటి వెంకటేశ్వరశాస్త్రిలు వీటిని తమ కార్యాలయానికి అందజేశారని అధ్యక్షుడు బల్లిపర ప్రసాదరావు తెలిపారు. దాతలను రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యవర్గం సన్మానించింది.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



మైలవరం: విద్యార్థులు క్రమశిక్షణ, కార్యదీక్ష, పోటీతత్వంతో బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు అన్నారు. మైలవరం మండలంలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 15 వేలు, రూ. 10 వేలు, మరో 11 మందికి రూ. 3 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వసంత నాగేశ్వరరావును సన్మానించారు. మైలవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కుడుముల తిమ్మారెడ్డి, జన సేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో రక్తదానం



నూజివీడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యవంతమైన ప్రతి వ్యక్తీ రక్తదానం చేయవచ్చని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ట్రిపుల్ ఐటీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారికి, ఆస్పత్రుల్లో నిర్వహించే శస్త్రచికిత్స సమయంలో, తలసేమియా రోగులకు రక్తం ఎంతో అవసరమన్నారు. రక్తం సకాలంలో అందించడం ద్వారా వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. ఏఓ బి.లక్ష్మణరావు, రెడ్‌క్రాస్ సొసైటీ కో–ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త శ్రావణి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

ముసునూరు: యువతి అదృశ్యంపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్కిరెడ్డిగూడెంకు చెందిన యువతి (19) ఈనెల ఒకటో తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రీడల్ ప్రాంగణాలు

- వరదలకు ధ్వంసమైన ఆట స్థలాలు
- అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరం
- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు



మిలటరీ వాహనాల రాకపోకలు, వరదతో అధ్వానంగా మారిన కొండపల్లి జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణం

ఇబ్రహీంపట్నం: ఇటీవల వచ్చిన కృష్ణానది వరదలు, బుడమేరు వరద ప్రభావంతో ప్రభుత్వ జెడ్పీ పాఠశాలల్లోని క్రీడా ప్రాంగణాలు అధ్వానంగా మారాయి. ఇది జరిగి రెండు నెలలు గడిచినప్పటికీ విద్యా శాఖాధికారులు వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టలేదు. కొండపల్లి మున్సిపాలిటీలోని జెడ్పీ బాలుర, జెడ్పీ బాలికల పాఠశాలలతో పాటు గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, మూలపాడులో మొత్తం ఐదు జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు.

గత ప్రభుత్వంలో క్రీడా ప్రాంగణాల అభివృద్ధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేశారు. నాడు–నేడు పథకంలో పాఠశాలలతో పాటు క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి నిధులు కేటాయించి తీర్చిదిద్దారు. అప్పట్లో విద్యార్థులు క్రీడలతో ఉల్లాసంగా గడిపేవారు. స్థానికులు, వయోవృద్ధులు, వాకర్స్ ఉదయం, సాయంత్రం వ్యాయామానికి వచ్చి తమ ఆరోగ్యాన్ని కాపాడుకునే వారు. ప్రస్తుతం పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలపై పాలకులు, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు.

క్రీడా మైదానాలతో అందరికీ ఆరోగ్యం

ఐదు జెడ్పీ పాఠశాలల్లో విశాలమైన క్రీడా మైదానాలు ఉన్నాయి. విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందడంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన వాకర్లు ఉదయం, సాయంత్రం తరగతులు జరగని వేళల్లో విద్యార్థులకు ఆటకం కలుగకుండా వ్యాయామం చేసుకునేవారు. విద్యార్థులు సాయంత్రం సమయంలో పలు క్రీడలు ఆడుకునేవారు. క్రీడా ప్రాంగణాలు గత రెండు నెలల నుంచి వినియోగంలో లేకవడంతో విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందలేక పోతున్నారు. కొండపల్లిలో బుడమేరు వరద, ఇబ్రహీంపట్నంలో కొండవాగు, కృష్ణానది వరదతో పాఠశాలల ప్రాంగణాలు నీటి ముంపుతో ధ్వంసమయ్యాయి. బుడమేరుకు వచ్చిన వరదల వల్ల కొండపల్లి శాంతినగర్ వద్ద గండ్లు పూడ్చేందుకు ఆర్మీ ఇంజినీరింగ్ బృందం ఇక్కడకు రావడంతో వారి వాహనాలు జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉంచారు. వాహనాల రాకపోకలతో మైదానం పూర్తిగా ధ్వంసమై క్రీడలకు పనికి రాకుండా పోయింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిల్వ ఉన్న మురుగు నీరు

మైదానాలు బాగుంటేనే క్రీడల్లో రాణింపు



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలంటే పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు బాగుండాలి. ఇటీవలి కాలంలో వచ్చిన వరదల ప్రభావంతో పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు చాలా వరకు అధ్వానంగా మారాయి. నీటి ముంపునకు గురైన ప్రాంగణాలను త్వరగా అభివృద్ధి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి. అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– పోతురాజు ఏసుదాసు, కొండపల్లి

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు ప్రారంభం

తిరువూరు: కార్తిక మాసం సందర్భంగా తిరువూరు పట్టణంలోని శివాలయాల్లో శనివారం తెల్లవారుఝాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. చంద్రమౌళీశ్వరాలయం, రామలింగేశ్వరాలయం, గౌరీ కేదారేశ్వరాలయాల్లో పంచామృతాలతో పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. రాజుపేట, చీరాల సెంటర్లలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా కార్తిక మాస విశేష పూజలు నిర్వహించారు.

ఆలయాలకు కార్తిక శోభ..

ఆగిరిపల్లి: శివ,కేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసం ప్రారంభంతో ఆలయాలు కార్తిక శోభను సంతరించుకున్నాయి. స్థానిక సత్రం సెంటర్‌లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించారు. వరాహ పుష్కరిణి వద్ద గల బాలా త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో, శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి కొండపై మల్లికార్జున స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు: రమణక్కపేట సబ్‌స్టేషన్ పరిధిలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని జేఈ సుబ్బారావు తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

గోశాలకు ఆవుల తరలింపు

విస్సన్నపేట: రహదారులపై వదిలివేసిన ఆవులను ఎ. కొండూరు రోడ్డులోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద గోశాలకు శనివారం తరలించారు. మొదటి రోజు రూ.500 చెల్లించి తమ గోవులను తీసుకు వెళ్లవచ్చని, రెండో రోజుకు రూ. 200 అదనంగా చెల్లించవలసి ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. గోశాలను తహసీల్దార్ కె. లక్ష్మీ కల్యాణి, ఎంపీడీఓ చిన్నరాట్నాలు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ హరికృష్ణ కుమార్, ఏఎస్‌ఐ సక్రునాయక్ పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి

విస్సన్నపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలంలో అధికంగా ఏర్పాటు చేయాలని రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జి. రామకృష్ణ, ఏడుకొండలు విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ వరి పంట కోతలు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను దళారుల నుంచి కాపాడాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు, పట్టణ కార్యదర్శి జ్ఞానరత్నం పాల్గొన్నారు.

సకల మృతుల సంస్మరణ దినోత్సవం

ఇబ్రహీంపట్నం: చనిపోయిన తమ కుటుంబీకుల ఆత్మలకు శాంతి కలగాలని మండల వ్యాప్తంగా క్రైస్తవులు సకల మృతుల సంస్మరణ (సమాధుల) దినోత్సవం శనివారం నిర్వహించారు. సమాధులను పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. ఇబ్రహీంపట్నం ఆర్సీఎం చర్చి విచారణ గురువులు అనిల్‌కుమార్ ప్రతి సమాధి వద్ద కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా క్యాథలిక్‌లు ప్రతి ఏడాది సమాధుల పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆయా గ్రామాల సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.



కిలేశపురంలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ అనిల్‌కుమార్, క్రైస్తవులు

కరపత్రాల ఆవిష్కరణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పెట్రోలియం, గ్యాస్ రవాణా వాహనాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, లోడింగ్, అన్ లోడింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న విజయవాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్‌ఎస్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు కొండపల్లి ఐడీఏలో కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. డ్రైవర్లపై మోపుతున్న హిట్ అండ్ రన్ కేసులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు, వర్కర్లకు కార్మికచట్టం మేరకు కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి కాంట్రాక్ట్ కార్మికులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా నియమించాలని, వర్కర్లకు రెస్ట్ రూమ్, పార్కింగ్ స్థలం కేటాయించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, ఐడీఏలోని కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సగ్గూరులో గ్రామ సభ

ఆగిరిపల్లి: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ కేఎస్వీ ప్రసాద్ అన్నారు. శనివారం సగ్గూరులో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. భూ రీ సర్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. డెప్యూటీ తహసీల్దార్ మరియన్న, వీఆర్వో పత్తిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బాలల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ జాన్సన్

తిరువూరు: 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని, ఈ వివాహాలు చెల్లనేరవని బాలల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ జాన్సన్ అన్నారు. తిరువూరు షాదీఖానాలో శనివారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిరోధంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాన్సన్ మాట్లాడుతూ ఆడపిల్లలపై తల్లిదండ్రులు వివక్ష చూపరాదని, వారికి కూడా చదువుకునే హక్కు ఉందని చెప్పారు. వారిని మైనార్టీ తీరేవరకు చదివించాలని సూచించారు. బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై పోక్సో చట్టం కింద తీసుకునే చర్యలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. తిరువూరు మండల విద్యా శాఖాధికారి శ్యాంసుందర్, ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి, సహాయ సాంఘిక సంక్షేమాధికారి గాయత్రి మాట్లాడుతూ పలు చట్టాలను వివరించారు.



మాట్లాడుతున్న జాన్సన్

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: ఎండీయూ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న డ్రైవర్‌ను ఇబ్రహీంపట్నం పోలీసులు శనివారం పట్టుకున్నారు. జూపూడి గ్రామానికి చెందిన వాహనంలో అక్రమంగా ప్రజల నుంచి సేకరించిన బియ్యం కొండపల్లిలోని రేషన్ మాఫియాకు విక్రయించేందుకు తరలిస్తున్న సమయంలో పోలీసులు గుర్తించారు. వాహనంలో సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పారిశుద్ధ్య కార్మికులు, వాచ్‌మన్లపై ఎస్‌ఎంసీల ప్రతాపం

ఎస్‌ఎంసీల పనితీరుపై విమర్శలు

ముసునూరు: మండలంలోని పాఠశాలలకు కొత్తగా ఎన్నికైన ఎస్‌ఎంసీలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో ఎస్‌ఎంసీల ఎంపిక నాటి నుంచి పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీల వారిపైనా, పాఠశాల పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్లపై తమ ప్రతాపం చూపడం ప్రారంభించారు. వీరికి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు మద్దతు పలుకుతుండడంతో మరింత విజృంభిస్తున్నారు. ఇప్పటికే ముసునూరు హైస్కూల్లో వంట ఏజెన్సీని, నైట్ వాచ్‌మన్‌ను తొలగించగా, తాజాగా శనివారం లోపూడి యూపీ స్కూల్లో హడావుడిగా ఎస్‌ఎంసీ సమావేశం ఏర్పాటు చేసి వంట ఏజెన్సీ వారిని, పారిశుద్ధ్య కార్మికురాలిని అర్ధంతరంగా తొలగిస్తున్నట్లు తీర్మానాలు చేశారు.

సంబంధంలేని వ్యక్తుల హాజరుపై ఆగ్రహం

సమావేశానికి పాఠశాలకు, ఎస్‌ఎంసీకి సంబంధం లేని వ్యక్తులు హాజరు కావడంతో స్థానికులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల్లో కొంతసేపు గందరగోళం, ఘర్షణ వాతావరణం చెలరేగింది. దీంతో ఉపాధ్యాయులు కమిటీకి సంబంధం లేని వ్యక్తులను బయటకు పంపి సమావేశం నిర్వహించి వంట ఏజెన్సీ వారిని, పారిశుద్ధ్య కార్మికురాలిని తొలగించినట్లు ప్రకటించారు.

అధికారులు స్పందించాలి

తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పాఠశాలల్లో పని చేసుకుంటున్న పేదలను అకారణంగా, ఏడాది మధ్యలో అర్ధంతరంగా తొలగిస్తున్న ఎస్‌ఎంసీ కమిటీల పనితీరుపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

బ్యాంకు లావాదేవీలపై నిఘా అవసరం



బ్యాంకర్లకు సూచనలిస్తున్న సీఐ గిరిబాబు

తిరువూరు: బ్యాంకుల్లో గుర్తు తెలియని వ్యక్తులు జరిపే లావాదేవీలపై నిఘా ఉంచాలని తిరువూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు బ్యాంకు మేనేజర్లను కోరారు. సైబర్ మోసాలపై తిరువూరులోని జాతీయ బ్యాంకుల మేనేజర్లకు పోలీసులు శనివారం పలు సూచనలు చేశారు. నిరక్షరాస్యులు, వృద్ధులను మోసగించి నగదు అపహరించడం, ఆన్‌లైన్ ఖాతాల్లో సొమ్మును ఓటీపీ తెలుసుకుని ఉపసంహరించడం వంటి మోసాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను తమకు తెలియజేయాలని, అనుమానాస్పదంగా బ్యాంకుల వద్ద సంచరించే వారిపై నిఘా ఉంచాలని కోరారు. వినియోగదారులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగే విధంగా బ్యాంకు ఆవరణలో పోస్టర్లు ప్రదర్శించాలని సూచించారు. ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు. తిరువూరు మండలంలోని 13 బ్యాంకుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి

సీఐ సత్యశ్రీనివాస్

నూజివీడు: చట్ట వ్యతిరేక ఘటనలు చోటు చేసుకున్నప్పుడు నేరాలను సులువుగా, తొందరగా ఛేదించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని సీఐ పి.సత్యశ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుపై వర్తక సంఘాల నాయకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, శ్రీనివాస సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, సింగ్ హోటల్ సెంటర్, మున్సిపల్ ఆఫీస్ సెంటర్, బస్టాండు సెంటర్, పోతురెడ్డిపల్లి అడ్డ రోడ్డు, బైపాస్ రోడ్డు, తిరువూరు బస్టాపు సెంటర్, గాంధీనగర్ గాంధీ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనికి వ్యాపారులంతా తమ సహకారం అందించాలని కోరారు. పలువురు వర్తక సంఘాల నాయకులు మాట్లాడుతూ పట్టణంలో గతంలో కూడా అనేకసార్లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, అనంతరం వాటి నిర్వహణ సరిగా లేదని చెప్పారు. ఇక నుంచి సీసీ కెమెరాల నిర్వహణ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్‌ఐ జ్యోతిబసు, వర్తక సంఘం నాయకులు పగడాల సత్యనారాయణ, పెనుగొండ రామారావు, పేర్ల ప్రశాంత్, వనమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వర్తక సంఘాల నాయకులతో మాట్లాడుతున్న సీఐ సత్యశ్రీనివాస్

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థిని మౌనికతో హెచ్‌ఎం సుజాత, పీఈటీ వెంకయ్య



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ మాధవరావు

మైలవరం: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థిని బత్తుల మౌనిక ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. సుజాత తెలిపారు. పాఠశాలలో శనివారం హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థిని మౌనిక ఈ నెల 17న నెల్లూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపికైన విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు కె.వెంకయ్యను హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు బ్యాడ్మింటన్ అండర్–14, 17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీలత శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ పోటీలలో భాగంగా గూడూరు జెడ్పీ హైస్కూల్లో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో బి. రాజేష్, ఎస్‌కే ఖాదర్, అండర్–17 విభాగంలో బి. భాను సత్తా చాటారన్నారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున అన్నమయ్య జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విద్యార్థులు, పీడీ సీజర్‌రెడ్డి, పీఈటీ మాధవరావులను పలువురు అభినందించారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి

మైలవరం: విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సరళకుమారి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఫెంటాస్టెక్–2కే 24 కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్సీ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా టెక్ చెరాడ్స్, టెక్ ట్రెజర్ హంట్, పిక్చర్ పర్‌ఫెక్ట్ మెమోరీ టెస్ట్, పోస్టర్ ప్రజంటేషన్, సీఎస్ ట్రానియా పెయింటింగ్, డిబేట్స్, స్లిప్ పర్సనాలిటీ తదితర అంశాలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు, సిబ్బంది, ఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజయవాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంప్స్‌గా నిలిచారు.

రేపు పంట పెట్టుబడి సాయంపై ఆందోళనలు

ముసునూరు: ఎన్నికల్లో రైతులకు చేసిన వాగ్దానం పంట పెట్టుబడి సాయం (అన్నదాత సుఖీభవ)ను అమలు చేసేది ఎప్పుడని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకుడు నిమ్మగడ్డ నరసింహ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బలివే గ్రామంలో రైతు సంఘ మండల నేతలతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ ప్రారంభమైనా రైతులకు ఇంత వరకు పంట పెట్టుబడి సాయం అందించకపోవడం విచారకరమన్నారు. వరి పంటకు మద్దతు ధర ప్రకటించకపోవడం మరింత దారుణమని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల 4 నుంచి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతి గ్రామ సచివాలయంలో రైతులతో కలిసి వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో మండల రైతు సంఘ నేతలు చెంగల వెంకటేశ్వరరావు, జంగిమిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

ముసునూరు: ఆది, సోమవారాల్లో ఏలూరులో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు పిలుపునిచ్చారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభలకు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పద్మకిశోర్, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని సీఐ ఎ.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సెయింట్ జేవియర్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ పుష్పలతతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. ఎస్‌ఐ విజయలక్ష్మి, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఎస్‌ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న సీఐ చంద్రశేఖర్, ఎంఈఓ పుష్పలత